www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 11 ఏప్రిల్ 2025 | 5 | ఏలూరు



16న మెగా జాబ్ మేళా


ప్రజాశక్తి - చింతలపూడి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఒక అరుదైన ఉద్యోగ అవకాశాన్ని అందించేందుకు చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. ఈ నెల 16న తేదీ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా నిర్వహించే ఉద్యోగ మేళాలో 15కి పైగా జాతీయ, బహుళ జాతీయ సంస్థలు పాల్గొననున్నాయని తెలిపారు. ఈ మేళాలో పదో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు (పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బీటెక్, బిఎ, బీకాం, బిఎస్‌సి, బీ ఫార్మసీ, ఎంఎస్‌సి, ఎంకాం, ఎంబిఎ, ఎంఎ) పాల్గొనవచ్చని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సిఎం సారూ..

రైతుల గోడు పట్టించుకోరూ..!

- ధర కోసం కోకో రైతుల గగ్గోలు
- ధర లేక ఆక్వా రైతులు కుదేలు
- మామిడి ధర పతనంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- నూతన పామాయిల్ పరిశ్రమ, మామిడి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం ఎదురుచూపు
- నేడు ఆగిరిపల్లిలో సిఎం చంద్రబాబు పర్యటన



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా రైతాంగం గుండెకోత ప్రభుత్వానికి పట్టడం లేదు. పండించిన పంటకు ధరలేక ఆక్వా, కోకో, మామిడి, చేపలు సాగుచేసే రైతులు రోడ్డెక్కి ఆందోళనలు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. నూతన పామాయిల్ ఫ్యాక్టరీ, మామిడి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి రైతులకు మేలు చేస్తామని చెప్పిన మాటలు బూటకంగా మారడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో 'మా గోడు పట్టించుకోండి.. సిఎం సారూ'.. అంటూ రైతులు వేడుకుంటున్న పరిస్థితి.

ఏలూరు జిల్లాలోని ఆగిరిపల్లిలో సిఎం చంద్రబాబు శుక్రవారం పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించాలంటూ జిల్లా రైతాంగం వేడుకుంటోంది. జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాల్లో కోకో పంటను రైతులు సాగు చేస్తున్నారు. కొబ్బరి సాగుచేసే రైతులకు ప్రధాన ఆదాయ వనరు కోకోనే. గతేడాది కిలో కోకో గింజల ధర అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా రూ.వెయ్యికిపైగా లభించింది. ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్లో ప్రస్తుతం కిలో కోకో గింజల ధర రూ.750 వరకూ ఉన్నప్పటికీ కంపెనీలు మాత్రం కిలో రూ.550కు మించి కొనుగోలు చేయడం లేదు. పాత గింజలను అత్యంత దారుణంగా కిలోకు రూ.300 మాత్రమే ఇస్తామని కంపెనీలన్నీ సిండికేట్‌గా మారి రైతులను దెబ్బతీస్తున్నాయి. కోకో గింజలను అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కొనుగోలు చేయాలని రైతులు రోడ్డెక్కి అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులతోపాటు వ్యవసాయ మంత్రి వరకూ తమ సమస్యను తీసుకెళ్లి చర్చించారు. ఇప్పటి వరకూ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. దీంతో కోకో రైతులు నష్టాలకు తమ పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కోకో రైతులను పట్టించుకోవడం లేదనే ఆవేదన వెంటాడుతోంది.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాల నేపథ్యంలో ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి ధరలు అమాంతం తగ్గించేశారు. రొయ్య ధర కిలోకు రూ.40 వరకూ తగ్గిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. వంద కౌంట్ ధర కిలో రూ.220కు కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చినప్పటికీ వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దెబ్బతీస్తున్నారు. కిలో రూ.240 ఇస్తే తప్ప గిట్టుబాటు కాదని ఆక్వా రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయడంతోపాటు క్రాప్ హాలిడేకు సైతం సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం ఆక్వా రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అత్యధికంగా దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రెండు జిల్లాల్లోని ఆక్వా రైతులు కోలుకోలేని పరిస్థితి నెలకొంది.

మామిడి ధర పతనంతో నష్టాలు

ఏలూరు జిల్లాలో దాదాపు 70 వేల ఎకరాల్లో మామిడి సాగు ఉంది. నూజివీడు ప్రాంతం మామిడి సాగుకు ప్రసిద్ధి. అకాల వర్షాలు, ఈదురుగాలులకు ఈ ఏడాది మామిడి దిగుబడి బాగా తగ్గిపోయింది. ఎకరాకు ఆరు టన్నుల వరకూ దిగుబడి రావాల్సి ఉండగా మూడు టన్నులు రావడమే గగనంగా మారిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మరోపక్క ధర లేక రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ప్రస్తుతం చిన్నరసాలు, కలెక్టర్ కాయలు టన్ను ధర రూ.13 వేలు పలుకుతోంది. టన్ను ధర కనీసం రూ.25 వేలు ఉంటే తప్ప గిట్టుబాటు ఉండదని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. పెద్దఎత్తున పెట్టుబడి పెట్టిన మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోని పరిస్థితి.

కొల్లేరులో విధ్వంసంతో చేపల రైతులకు ఇక్కట్లు

కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామంటూ 2014-19 మధ్య కాలంలో టిడిపి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం సైతం చేసింది. ఇప్పుడు కోర్టు ఆదేశాలంటూ కొల్లేరులో వేలాది ఎకరాల్లో చేపల చెరువులను అటవీశాఖ అధికారులు ధ్వంసం చేస్తున్నారు. దీంతో చేపల సాగు చేసిన రైతులు అయినకాడికి అమ్ముకోవాల్సి రావడంతో తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. కొల్లేరు రైతులను ఆదుకుంటామని చెబుతున్నప్పటికీ ఆచరణ మాత్రం లేకుండా పోయింది. దీంతో తమ సమస్యను పరిష్కరించాలంటూ కొల్లేరు రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. కొల్లేరులో చేపల సాగు చేస్తున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవడంతోపాటు మూడో కాంటూరుకు కుదింపు, జిరాయితీ, సొసైటీ భూముల అప్పగింతపై ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

నూతన పామాయిల్ పరిశ్రమ, మామిడి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం ఎదురుచూపు

జిల్లాలో దాదాపు లక్షకుపైగా ఎకరాల్లో పామాయిల్ సాగు ఉంది. పెదవేగిలోని పామాయిల్ పరిశ్రమ పాతబడిపోయింది. దీంతో ఇక్కడ పామాయిల్ రికవరీ శాతం సరిగా రావడం లేదు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో రికవరీ శాతాన్ని నిర్ధారించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పామాయిల్ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.200 కోట్లతో కొత్త పామాయిల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని మాటలు చెబుతున్నారే తప్ప అడుగు ముందుకు పడటం లేదు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం కొత్తగా పామాయిల్ పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుతోంది. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో ఒక్క కొత్త పామాయిల్ పరిశ్రమ కూడా ఏర్పాటు చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నూజివీడులో మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామంటూ గత, ప్రస్తుత ప్రభుత్వాలు సైతం చెప్పాయి. ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటైతే మామిడి రైతులకు మేలు జరిగే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నినదిస్తున్న నేతలు, ప్రజలు

పట్టెన్నపాలెం వంతెన నిర్మాణం చేపట్టాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి
- వంతెన వద్ద నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ పాదయాత్ర, ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టెన్నపాలెం వంతెన నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం మండల కమిటీ ఆధ్వర్యాన పట్టెన్నపాలెం వంతెన నిర్మాణం చేపట్టాలని గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ యాత్రకు పట్టెన్నపాలెం వంతెన వద్ద సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్ర జైనవారిగూడెం, శ్రీనివాసపురం రోడ్డు మీదుగా జంగారెడ్డిగూడెం మార్కెట్ ఏరియా, బుట్టాయగూడెం రోడ్డు, ఆర్‌టిసి బస్టాండ్ మీదుగా ఆర్‌డిఒ కార్యాలయం వరకూ పాదయాత్ర సాగింది. అనంతరం అక్కడ చేపట్టిన ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, టి.నాగమణి మాట్లాడుతూ పట్టెన్నపాలెం వంతెన నిర్మాణం ప్రారంభించి ఇప్పటికి 11 సంవత్సరాలైందన్నారు. ప్రభుత్వాలు మారినా ప్రజాప్రతినిధుల వాగ్దానాలు మిగలడం తప్ప వంతెన పనులు పూర్తి కాకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వర్షాల సమయంలో ఇక్కడ ప్రమాదాలకు గురై ఇప్పటి వరకు ఎనిమిది మంది మరణించారని, అయినప్పటికీ ప్రభుత్వం మొద్దునిద్ర వీడకపోవడం దారుణమన్నారు. చింతలపూడి, పోలవరం ఎంఎల్‌ఎలు ఎన్నికల ముందు వంతెనలు నిర్మిస్తామని వాగ్దానం చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి పది నెలలవుతున్నా కదలిక లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ వంతెన పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 15 కిలోమీటర్లు మేర గిరిజనులు మండుటెండలో మొక్కవోని దీక్షతో బ్రిడ్జి నిర్మాణం కోసం పాదయాత్ర చేపట్టారంటే వారు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో అర్థం చేసుకోవాలన్నారు. తక్షణమే టిడిపి, జనసేన నేతలు ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధుల ద్వారా సిఎంతో మాట్లాడి తక్షణమే వంతెన నిర్మాణం పూర్తికి నిధులు కేటాయించేలా చూడాలని సవాలు విసిరారు. వంతెన నిర్మాణం పూర్తయ్యేలోపు తాత్కాలిక కల్వర్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కన్వీనర్ పసల సూర్యారావు, జిల్లా కమిటీ సభ్యులు తామా ముత్యాలమ్మ, నేతలు జి.సూర్యకిరణ్, బొడ్డు రాంబాబు, పోలోజు, నాగేశ్వరరావు, జోడి సూర్యచంద్రం, అందుగుల ప్రభాకరరావు, యాగంటి సీత, వామిశెట్టి నరసరావు, ఎస్‌కె.మాబుసుభాని, వంగా గోపీ, పి.పోతురాజు, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో నేతలు

సిఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గురువారం ఆయన వడ్లమాను గ్రామంలో శుక్రవారం ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి శుక్రవారం ఉదయం 10.10 నిముషాలకు వడ్లమాను చేరుకుంటారని, తొలుత వివిధ కులవృత్తులవారిని వారి పని ప్రదేశాల్లో కలిసి సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. అనంతరం ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకొంటారని, అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. ఆనంతరం పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకొంటున్న మంత్రి పార్థసారథి



ధర్నా చేస్తున్న మహిళలు

పెంచిన ఆస్తి పన్ను తగ్గించాలి

- ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను రద్దు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పట్టణాల్లో పెంచిన ఆస్తి (ఇంటి) పన్ను తగ్గించాలని, ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 సంవత్సరాలకు సంబంధించి పట్టణాల్లో ఆస్తి పన్ను గత సంవత్సరంతో పోలిస్తే 15 శాతం, 2020- 21 సంవత్సరాలతో పోలిస్తే 30 శాతం పెంచుతూ గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చి ప్రజల నడ్డి విరిచిందని పేర్కొన్నారు. దీంతో రూ.321 కోట్ల భారం పట్టణ ప్రజలపై పడుతుందని తెలిపారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, పన్నులు పెంచబోమని మేనిఫెస్టోలో పెట్టి మరీ ఇచ్చిన హామీని ఇప్పుడు తుంగలో తొక్కిందని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగి ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని ప్రవేశపెట్టి చట్ట సవరణ చేసి జిఒ 198 తీసుకొచ్చిందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం బాటలోనే కూటమి ప్రభుత్వం నడుస్తూ ఇంటి పన్నులు పెంచడం దుర్మార్గమని పేర్కొన్నారు. గత ఐదేళ్లల్లో సుమారు వంద శాతం పన్ను పెరిగిందని, ఇది ఇంటి యజమానుల మీదే కాకుండా అద్దెదారుల పైన పరోక్ష ప్రభావం పడుతుందని తెలిపారు. పట్టణాల్లో పౌర సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు పన్నుల పెంపుపై దృష్టి పెట్టడం ఏంటని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని రద్దు చేయాలని, పెంచిన ఇంటి పన్నును ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు.

గ్యాస్, పెట్రో ధరలు తగ్గించాలని ఆందోళన

ప్రజాశక్తి - టి.నరసాపురం

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ సిపిఎం, ఐద్వా ఆధ్వర్యంలో మండలంలోని ఎఎస్‌ఆర్ నగర్ వద్ద మూడు రోడ్ల జంక్షన్‌లో గురువారం మహిళలు ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఖాళీ సిలిండర్లు పెట్టి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రో ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై పెనుభారం మోపిందన్నారు. తక్షణం పెంచిన ధరలు ఉపసంహరించాలని కోరారు. ఆందోళనలో ఐద్వా మండల కార్యదర్శి మడకం కుమారి, సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి, నేతలు బరకడు కుమారి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ముందుకు సాగితేనే అభివృద్ధి

- ఆర్‌టిసి విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు
- ఏలూరు డిపోలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అందరూ కలిసికట్టుగా ముందుకు సాగితేనే ఆర్‌టిసి సంస్థ అభివృద్ధిలో మరింత ముందుకు వెళ్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విజయవాడ జోన్-2 జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఆయన ఏలూరు డిపోలో గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఏలూరు డిపో గ్యారేజ్‌లో మెకానికల్ స్టాఫ్, అవుట్‌సోర్సింగ్ స్టాఫ్ ఎంతమంది పనిచేస్తున్నారనే వివరాలు తెలుసుకున్నారు. గ్యారేజ్‌లో వాషింగ్ ప్లాంట్, మిగిలిన విభాగాలు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులతో మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని, అప్పుడే సంస్థ అభివృద్ధి మరింత ముందుకు వెళ్తుందని, కార్మికులకు కావాల్సిన అన్ని విషయాల్లో తన వంతు సహాయం ఉంటుందని తెలిపారు. సంస్థ మనుగడ ముఖ్యమన్నారు. అదేవిధంగా ఆర్‌టిసి ఆసుపత్రి సందర్శించి నిశితంగా ప్రతి విషయాన్ని పరిశీలించారు. కార్మికులకు అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వారికి అండగా నిలబడి మంచి వైద్యాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, అసిస్టెంట్ మేనేజర్ జి.మురళి, ఎంఎఫ్‌ఐ ప్రేమ్ కుమార్, అన్ని కార్మిక సంఘాల నాయకులు, పిఆర్‌ఒ నరసింహం పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న రెడ్డి అప్పలనాయుడు

ఇండోర్ స్టేడియం పరిశీలన

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలోని మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2017లో పనులు ప్రారంభించి అసంపూర్తిగా నిలిచిపోయిన ఇండోర్ స్టేడియంను ఎపి పోలీస్ హౌసింగ్ డిపార్టుమెంట్ అధికారులు గురువారం పరిశీలించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి ఒక ఇండోర్ స్టేడియం మంజూరు చేయడంతో నారాయణపురం అనువుగా ఉంటుందని రూ.1.50 కోట్లు నిధులు కేటాయించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి సుమారు రూ.60 లక్షలు విలువైన పనులు చేశారు. అయితే ఆయనకు రూ.50 లక్షల మేర బిల్లులు మంజూరు చేశారు. ఈ లోపు 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పనులు నిలిచిపోయాయి. మళ్లీ టిడిపి అధికారంలోకి రావడంతో గతంలో పనులు ప్రారంభించిన నిలిచిపోయిన ఇండర్ స్టేడియం పనులను పరిశీలించాలని ప్రభుత్వ ఆదేశాలతో తాము వచ్చినట్లు ఎపి పోలీసు హౌసింగ్ ఎఇ రాము తెలిపారు. డిఇ అబ్దుల్ ఖాదర్, సబ్ కాంట్రాక్టర్ అక్కిన శేషగిరిరావు పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రబీ పంటలకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు

- పప్పు ధాన్యాల కొనుగోలుకు ఏర్పాట్లు
- జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

2024-25 రబీ సీజన్‌లో పంట ఉత్పత్తులకు ప్రభుత్వంచే నిర్ణయించిన కనీస మద్దతు ధర అందేలా జిల్లా వ్యాప్తంగా తగు ఏర్పాట్లు చేసినట్లు, పప్పు ధాన్యాల కొనుగోలుకు సైతం ఎపి మార్క్‌ఫెడ్ ద్వారా ఆర్‌ఎస్‌కె, సహకార సంఘాల సమన్వయంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. దళారుల బెడద లేకుండా రైతులకు న్యాయం చేసేందుకు సదరు కొనుగోలుకు బయోమెట్రిక్ తప్పనిసరిగా అమలు చేయనున్నట్లు చెప్పారు. సేకరించిన ఉత్పత్తులను సులభంగా ట్రాక్ చేయడానికి వీలుగా సంచులకు క్యూఆర్ కోడ్/ఆర్‌ఎఫ్ ఐడీ ట్యాగ్ కూడా వేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని దెందులూరు, పెదపాడు, ఏలూరు మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 1,922 మెట్రిక్ టన్నుల పెసలను సేకరించాలనే లక్ష్యాన్ని నిర్ధారించగా, ఇప్పటికే సదరు లక్ష్యాన్ని అధిగమించి 2,095 మెట్రిక్ టన్నుల పెసలను కొనుగోలు చేశామని, తద్వారా సేకరించిన పెసల విలువ రూ.18,19,70,379 అని తెలిపారు. అంతేకాకుండా ఇంకా దిగుబడులొస్తాయన్న క్షేత్ర స్థాయి నివేదికల ఆధారంగా పెసల కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని కోరుతూ ప్రతిపాదనలు పంపగా సదరు లక్ష్యాన్ని 2,745 మెట్రిక్ టన్నులకు పెంచుతూ ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందన్నారు. రైతులు ధాన్యం కొనుగోలుకు సంబంధించిన మరింత సమాచారం, ఫిర్యాదుల నిమిత్తం జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ నెంబర్ 08812-230448, 7702003584, 7569562076, 7569597910 సంప్రదించవచ్చని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

- 24న ఏలూరు లేబర్ కార్యాలయం వద్ద ధర్నా
- ఎపి బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 24న ఏలూరు లేబర్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాలో భవన నిర్మాణ కార్మికులంతా పాల్గొనాలని ఎపి బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఓవర్ బ్రిడ్జి సెంటర్లో భవన నిర్మాణ కార్మికులు అయినపర్తి మాధవ అధ్యక్షతన నిరసన కార్యక్రమం నిర్వహించారు. రమణరావు మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా నిర్మాణ కార్మికుల హక్కులు, చట్టాల్ని కాలరాస్తున్నాయని విమర్శించారు. ఆరేళ్లుగా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు జరగకుండా ఇచ్చిన 1214 మెమో రద్దు చేసి సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలుగుదేశం, జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ 10 మాసాలైనా నెరవేర్చలేదని విమర్శించారు. ఆందోళన, పోరాటాలతోనే సంక్షేమ చట్టాలు అమలవుతాయని, కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కందుల సంతోష్, బి.కుటుంబరావు, పరస చిన్నారావు, ఉండవల్లి బాబ్జి, తోటకూర రవి, బోకినాలు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



నినదిస్తున్న భవన నిర్మాణ కార్మిక నేతలు

తాగు, సాగు నీరందించేలా చర్యలు

- మురుగు, పంట కాలవల్లో ఆక్రమణలు తొలగించాలి
- అధికారులు, నీటి సంఘం అధ్యక్షులతో ఎంఎల్‌ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

తాగు, సాగు నీరందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు చెప్పారు. ఉంగుటూరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, డ్రెయిన్ ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల (డిసి) ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డబ్ల్యుయుఎ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సభ్యులతో ఎంఎల్‌ఎ ధర్మరాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి సంఘం సభ్యులు వారి పరిధిలోని సమస్యలపై మాట్లాడుతూ పలు డ్రెయిన్లు ఆక్రమణలకు గురై పూడికపోవటంతో వరద నీరు పంట పొలాలకు చేరి పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయన్నారు. అదేవిధంగా తూరలకి సంబంధించి పలు సమస్యలను తెలిపారు. అధికారులు మాట్లాడుతూ మేజర్ డ్రెయిన్స్ పూడిక తీత ఉపాధి హామీ చట్టంలో తవ్వకాలు చేపట్టే విధంగా ఎంపిడిఒలకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేసి చివరి ఆయకట్టు వరుకు సాగు నీరందించి రైతులకు ఎటువంటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిలో భాగంగా కాలువల పక్కన పెరిగిన చెట్ల కొమ్మల తొలగింపునకు సంబంధించి అటవీశాఖ వారికి ప్రతిపాదనలు పంపి అనుమతి తీసుకురావాలన్నారు. అదేవిధంగా రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని సర్వే చేపట్టి పూడికతీతకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే రైతుల సమస్యల పరిష్కారం కోసం తాను సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, డ్రెయిన్స్ డిపార్ట్‌మెంట్ పలు డివిజన్ల, సెక్షన్ల డిఇ, ఎఇలు, అడవికొలను, అర్ధవరం, గుండుగొలను, తాడేపల్లిగూడెం డిసి ఛైర్మన్లు, నీటిసంఘాల అధ్యక్షులు సభ్యులు పాల్గొన్నారు.

బందోబస్తులో పాల్గొనే సిబ్బందికి పలు సూచనలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని వడ్లమాను గ్రామంలో ఈ నెల 11వ తేదీ శుక్రవారం సిఎం చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా గురువారం సాయంత్రం ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిశోర్ బందోబస్తు విధులో పాల్గొనబోయే పోలీసు సిబ్బందికి బ్రీఫింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతా పరంగా ఎటువంటి తప్పిదాలు జరగకుండా చూడాలని, డ్రోన్ కెమెరాల ద్వారా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్, జన సమ్మేళన నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్‌పి ఎన్.ఎస్.ఎస్.శేఖర్, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు, అతి వేగంతో వీచిన ఈదురుగాలుల కారణంగా మామిడి, మిరప, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలో చాలా ప్రాంతాల్లో చేతికి అంది వచ్చిన మొక్కజొన్న పంట నేలకొరిగిందని తెలిపారు. అధికారుల అంచనా ప్రకారం సుమారు 150 ఎకరాల్లో పంట నష్టం జరిగినప్పటికీ, క్షేత్రస్థాయిలో నష్టం మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. రైతుల కష్టాలను గుర్తించి వెంటనే సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - కుక్కునూరు

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కుక్కునూరు సెక్టార్ పరిధిలోని వింజరం-2 అంగన్వాడీ కేంద్రంలో సూపర్ వైజర్ మయూరి ఆధ్వర్యంలో గురువారం ఈ పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మయూరి మాట్లాడుతూ గర్భిణులకు పెరుగుదల పర్యవేక్షణ గురించి, ప్రత్యేక గృహ సందర్శనలు అంటే సున్నా నుంచి రెండేళ్ల పిల్లల్లో గ్రోత్ సందర్శన చేయడం పోషకాహారం ప్రాముఖ్యతను వివరించడానికి బాలింతలు, సంరక్షకులతో కలిసి సమావేశాలు, అనుబంధ పోషకాహార పద్ధతులపై గర్భిణులు, బాలింతలు, తల్లులు, కిశోర బాలికలకు అవగాహన కల్పించే విధంగా వివరించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ లక్ష్మి దేవి, ఆయా, ఆశావర్కర్లు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి, జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు అన్నారు. మండల విద్యాశాఖాధికారి బి.సుమలత ఆధ్వర్యంలో స్థానిక రైతు సేవా కేంద్రం ద్వారా ఏర్పాటు చేసిన రబీ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం తహశీల్దార్ బి.సాయిబాబా, ఎంపిడిఒ జె.మణికుమారిలతో కలిసి జయవరపు శ్రీరామమూర్తి, అడపా నాగరాజులు ప్రారంభించారు. అదేవిధంగా రాయితీపై రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారుల నుంచి మోసపోకుండా ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేస్తుందని ఆయన తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ప్రతి రైతు ఇ పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు నాయుడు రామకృష్ణ గౌడ్, పిన్నమనేని మధు, దామిశెట్టి సాయి, గంటా సతీష్, పెద్దిన సత్యనారాయణ, చింతలపూడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని గూటాల రైతు సేవా కేంద్రంలో రబీ సీజన్ 2024-25 సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రాంబాబు మాట్లాడుతూ వరి సాగు చేసే రైతులందరూ కూడా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ఇ పంట నమోదు చేసుకున్న రైతులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవడం వీలు పడుతుందన్నారు. రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1967, జిల్లా కంట్రోల్ రూమ్ 7702003584 ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఎంఎల్ఎ చింతమనేనికి పలు వినతులు

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ను దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో పలువురు కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పలు అర్జీలు పత్రికలు, పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎంఎల్ఎ సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు మానవత సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధితులకు మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. మండలంలోని యర్రంపేట గ్రామంలో ముంగమూరు నాగేశ్వరరావు తాటాకిల్లు మంగళవారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న మానవత కొయ్యలగూడెం మండల శాఖ ద్వారా రూ.30 వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షులు మాటూరు సుధీర్, ముప్పిడిపల్లి వెంకటేశ్వరరావు విఎస్ఎస్.స్వామి, బొమ్మ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరం

బుట్టాయగూడెం :బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆత్మబంధువుల సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేన్సర్ అనేది భయంకరమైన వ్యాధి అని అపోహ వద్దని, దానికి సంబంధించి అనేకమైన మందులు ఉన్నాయన్నారు. వాటికన్నా ముందు మన జీవనశైలిని నియంత్రించుకోవాలన్నారు. ఇల్లందు మాజీ ఎంఎల్ఎ గుమ్మడి నర్సయ్య, డిసిసిబి మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఐటిడిఎ పిఒ శ్రీరాములు నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి చంద్రమోహన్, జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమానుగు రవి, డిప్యూటీ డిఎంహెచ్ఒ సురేష్, న్యాయవాది ఏసుబాబు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

బుట్టాయగూడెం :కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పోలవరం నిర్వాసితుల అన్ని రకాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐటిడిఎ పిఒ రాములు నాయక్‌ను సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇల్లందు మాజీ ఎంఎల్ఎ గుమ్మడి నరసయ్య కోరారు. బుట్టాయగూడెంలో కేన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరం ఏర్పాటుచేసిన సందర్భంగా కరాటం సాయి చంద్ర మోహన్ ఇంటి వద్ద రాములు నాయక్‌ను నరసయ్య కలిసి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువతకు కటాఫ్ తేదీ లేకుండా ఆర్అండ్ఆర్ ఇవ్వాలని, 45.72 కాంటూరులో ఉన్న అన్ని గ్రామాలను 41.15లో తీసుకుని ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. అలాగే పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలను కలెక్టర్కు, ప్రభుత్వానికి తెలియజేస్తామని పిఒ చెప్పారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్వాధీనం


ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండల రేగుంట గ్రామంలో గురువారం దాడి చేశారు. ఈ దాడిలో ఒకరిని అదుపులోకి తీసుకుని 20 లీటర్ల నాటు సారాను, బైక్‌ను, సారా తయారీకి ఉపయోగించే 3 కేజీల పటిక, 20 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.పాండురంగారావు తెలిపారు. అతనికి బెల్లం సరఫరా చేస్తున్న నూజివీడు పట్టణానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నూజివీడు పట్టణంలోని ఎంఆర్.అప్పారావు కాలనీలో వ్యక్తి వద్ద రెండు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు తెలిపారు.


చింతలపూడిలో...


కొయ్యలగూడెంలో..


భీమడోలులో...


టి.నరసాపురంలో..

ఘనంగా ఎంపీ మహేష్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పుట్టినరోజు వేడుకలు టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇన్ పేషెంట్ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులు, బాలింతలు, గర్భిణులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. శాంతినగర్‌లోని ఎంపీ మహేష్ కుమార్ క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. టిడిపి ప్రొఫెషనల్ వింగ్ ఏలూరు పార్లమెంట్ అధ్యక్షుడు ఆరేపల్లి శివ ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి సంబంధిత వ్యాధులతో బాధపడుతూ శిబిరానికి తరలివచ్చిన వారికి నేత్రవైద్య నిపుణులు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మాదేపల్లిలోని ప్రేమాలయంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. కూటమి నాయకులు షేక్ కరీముల్లా, నందిగం రవిచంద్ర (నాని) ఆధ్వర్యంలో కోటదిబ్బలో ఉన్న మూగ, చెవిటి ఆశ్రమంలో వికలాంగులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దిబోయిన శివప్రసాద్, పూజారి నిరంజన్, ఎంపీ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఏలూరు ఎంపీ మహేష్ కుమార్ పుట్టినరోజు వేడుకలు శాంతినగర్‌లో యువజన నాయకుడు తొండూరు గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్ద ఎత్తున యువత పాల్గొని బాణసంచాను కాల్చి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. గణేష్ యాదవ్ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో కొన్ని ఆసుపత్రులను గుర్తించి అందులో రోగులకు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఏలూరులో....



కొయ్యలగూడెం : మండలంలోని బయ్యనగూడెం గ్రామంలో టిడిపి మండలాధ్యక్షులు పారేపల్లి నరేష్ ఆధ్వర్యంలో ఆంధ్ర హాస్పిటల్స్ వారిచే మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్, టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు హాజరై వైద్య శిబిరం ప్రారంభించారు. క్యాంపులో పాల్గొన్న ప్రజలకు సుమారు 200 మందికి గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు సభ్యత్వం నమోదు చేసుకున్న వారికి సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్, చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు పారేపల్లి రామారావు, పార్టీ గ్రామ అధ్యక్షులు పారేపల్లి వీరస్వామి, డిసిసిబి మాజీ డైరెక్టర్ పారేపల్లి సత్యనారాయణ, పరిమి రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బర చినరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, మహిళ రాష్ట్ర కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి, మండల మహిళ అధ్యక్షురాలు ఆకుల అరుణ, మహిళ మండల ప్రధాన కార్యదర్శి పెండ్యాల రమాదేవి పాల్గొన్నారు.

చింతలపూడి:మండలంలోని బట్టువారి గూడెంలో ఉన్న లిబర్టీ చిల్డ్రన్స్ హోమ్‌లో చిన్నారుల మధ్య ఘనంగా ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ పుట్టినరోజు వేడుకలను చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ నిర్వహించారు. చింతలపూడి ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక పట్టణ మండల కూటమి నాయకులతో కలసి భోజనాలు ఏర్పాటు చేసి వడ్డించారు. టిడిపి ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. మండలంలో పలుచోట్ల ఎంపీ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

భీమడోలు :ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పుట్టినరోజు కార్యక్రమాన్ని భీమడోలులోని టిడిపి కార్యాలయంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు హాజరై కేక్ కట్ చేశారు. మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కరణం పెద్దిరాజు, డి.పుల్లయ్య నాయుడు, యుగంధర్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపిపి శీలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం శివాలయ కళ్యాణ మండపంలో రోగులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి 275 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరంలో 50 మంది టిడిపి యువకులు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసిరెడ్డి మోహన్‌రావు, గండబోయిన శ్రీను, బండి శ్రీనివాసరావు, కేతిరెడ్డి వీరారెడ్డి, వెలిది నాగబాబు, సాధనాల బూసిబాబు, కలిశెట్టి పార్థసారథి, చిలకా బాలయ్య, అద్దంకి జగ్గారావు, కొనకళ్ల మోహన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు : టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కుక్కునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేద ప్రజలకు బ్రెడ్, పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండలాధ్యక్షులు మొలిశెట్టి నాగు మాట్లాడారు.

పోలవరం : పోలవరంలో ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, టిడిపి మండలాధ్యక్షుడు బొడ్డు కృష్ణ కేక్ చేసి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. పోలవరంలోని వృద్ధాశ్రమంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. వృద్ధులకు పండ్లు పంచి పెట్టారు.

ఎంపీ మహేష్‌కు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుభాకాంక్షలు

ఏలూరు సిటీ :ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌కు కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వయంగా ఫోన్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఎంపీ మహేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

సగంలో నిలిచిపోయిన గృహాలకు
బిల్లుల మంజూరుకు లైన్ క్లియర్

ప్రజాశక్తి - ఉంగుటూరు

గతంలో గృహ నిర్మాణాలు ప్రారంభించి బిల్లులు రానివారికి ఇప్పుడు కొత్తగా రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం జిఒ జారీ చేసిందని ఎంఎల్ఎ ధర్మరాజు చెప్పారు. 2017 నుంచి 2019 వరకు, అలాగే 2011 నుంచి 2014 వరకు, 2006 నుంచి 2009 వరకు ఇంటి నిర్మాణాలు ప్రారంభించి పునాదులతో ఆగిపోయిన వారి వివరాలు ఇప్పుడు ఆన్‌లైన్ చేసి వారికి బిల్లులు ఇచ్చే విధంగా ప్రభుత్వం జిఒ ఇచ్చింది. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు లబ్ధిదారులకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ లబ్ధి అందేలా చర్యలు చేపట్టాలని హౌసింగ్ ఎఇ సతీష్‌ను ఎంఎల్ఎ ఆదేశించారు.

రైతు సేవా కేంద్రాల సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - భీమడోలు

రైతులు కనీస మద్దతు ధరను పొందేందుకు ధాన్యం సేకరణకు ప్రత్యేకించిన రైతు సేవా కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవి కోరారు. మండలంలో కొనసాగుతున్న ధాన్యం సేకరణ ప్రక్రియ, మిల్లులకు తరలింపు ఇతర అంశాలను గురువారం నిర్వహించిన తన పర్యటన సందర్భంగా తహశీల్దార్ పరిశీలించారు. దీనిలో భాగంగా ఎఫ్‌పిఒ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ జరుగుతున్న పొలసానిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు, భీమడోలు 1 ,2 ,3 రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. రైతులతో మమేకమయ్యారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇదేవిధంగా ధాన్యం సేకరణ విషయమై సిబ్బంది పాటిస్తున్న నియమ నిబంధనలను పరిశీలించారు. తేమ శాతం గుర్తింపు ప్రక్రియను ప్రత్యేకంగా పరిశీలించారు. రైతులకు ధాన్యం కొనుగోలు విషయమై సమస్యలు ఎదురైనా, సలహాలు సూచనలు కావాల్సి వచ్చినా జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం అంబరుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ దుర్గా ఆగ్రో ఇండస్ట్రీస్, విజయదుర్గా రైస్ మిల్లులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ భీమడోలు డిప్యూటీ తహశీల్దార్, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేడు జ్యోతిరావు పూలే జయంతి వేడుక

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని ఆలపాటి గంగాభవాని కల్యాణ మండపంలో ఈ నెల 11వ తేదీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామని కూటమి నేతలు తెలిపారు. స్థానిక టౌన్ హాలులో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూలే జీవిత విశేషాలు తెలియజేయడంతో పాటు ఎంపీ, ఎంఎల్ఎలకు ఘన సన్మానం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమనికి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలతో పాటు పూలే సిద్ధాంత అభిమానులు హాజరవ్వాలని కోరారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ముసునూరు

తల్లి, బిడ్డ క్షేమంగా ఉండాలంటే గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి అన్నారు. మండలంలోని చెక్కపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా చెక్కపల్లి అంగన్వాడీ కేంద్రం వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడో నెల నిండిన తర్వాత గర్భిణి నిర్ధారణ అయిన వెంటనే వెయ్యి రోజుల ప్రోగ్రాంలో భాగంగా నిత్యం మంచి పోషకాహారం తీసుకోవాలని అంగన్వాడీ ఉపాధ్యాయ సూచన సలహాల మేరకు ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

భీమడోలు :భీమడోలు లోని సంతపేట ఆవాస ప్రాంతంలో జనసేన నాయకులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు గురువారం ప్రారంభించారు. జనసేన పార్టీ కార్యకర్తలు తాము చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వీరభద్రపురంలో అగ్నిప్రమాదం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పరుపుల ఫ్యాక్టరీలో మంటలు
రూ.3 కోట్ల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పరుపులు తయారు చేసే ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి రూ.మూడు కోట్ల విలువైన పరుపులు దగ్ధమయ్యాయి. ఈ ఘటన దెందులూరు మండలం సోమవరప్పాడు పంచాయతీ వీరభద్రపురంలో గురువారం మధ్యాహ్నం చోటు చేసు కుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... వీరభద్రపురం గ్రామంలో దుర్గా వైర్ అండ్ ఇంటక్స్ అనే పేరుతో సోఫాలు, పరుపులు తయారుచేసే ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నారు. ఇక్కడ తయారుచేసిన సోఫాలు వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతుంటాయి. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఫ్యాక్టరీలో దూది స్పాంజీల వల్ల అప్పటికే పెద్ద ఎత్తున చెలరేగాయి. దీంతో అందులో పని చేస్తున్న సిబ్బంది వెంటనే బయటకు పరుగులు తీశారు. యాజమాన్యం ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మూడు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని చాలాసేపు శ్రమించి మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగాయని అగ్నిమాపక సిబ్బంది ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. విషయం తెలుసుకున్న దెందులూరు తహశీల్దార్ బి.సుమతి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాద సమయంలో లోపల ఎవరూ చిక్కుకోకుండా ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని, దాదాపు రూ.మూడు కోట్ల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనాకు వచ్చామని తెలిపారు. ప్రమాదం వెనుక పూర్తి వివరాలను నివేదికను వెంటనే అందించనున్నామని తెలిపారు.


ఫ్యాక్టరీలో దగ్ధమవుతున్న పరుపులు

పొగాకు బ్యారన్‌పై పడిన భారీ వృక్షం

రూ.2 లక్షల ఆస్తి నష్టం
ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని బోడిగూడెం గ్రామానికి చెందిన జక్కు దుర్గారావు, సీతామహాలక్ష్మి దంపతులకు చెందిన పొగాకు బ్యారన్‌పై భారీ వృక్షం పడింది. దీంతో రూ.రెండు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోడిగూడెం గ్రామపంచాయతీ సర్పంచి గడ్డియ్య తెలిపిన వివరాల ప్రకారం.. గత మూడు రోజుల నుంచి సాయంత్రం వేళల్లో వాతావరణంలో మార్పులు వస్తున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం వచ్చిన గాలి వానతో భారీ వృక్షం ఒక్కసారిగా పొగాకు బ్యారన్‌పై పడింది. బ్యారన్ పై కప్పు విరిగిపోయి ఉడుకుతున్న పొగాకు మొత్తం వర్షానికి తడచి పాడైపోయిందని, సుమారు రూ.రెండు లక్షల వరకు రైతుకు నష్టం వాటిల్లిందని తెలిపారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని గడ్డియ్య కోరారు.


బ్యారన్‌పై పడిన వృక్షం

ఉచిత కుట్టు శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు

మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ, ఇడబ్ల్యూఎస్ ద్వారా అమలు చేస్తున్న ఉచిత కుట్టు శిక్షణా శిబిరం సేవలను వినియోగించుకోవాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు కోరారు. భీమడోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని పాత భవిత కేంద్రం వేదికగా ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణా శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. దీనిలో రోజుకు రెండు విడతలుగా 140 మందికి 90 రోజులపాటు శిక్షణను ఇవ్వనున్నట్లు, భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి, భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవి తెలిపారు. కనీసంగా 85 శాతం హాజరుతో శిక్షణ పొందిన వారికి ప్రభుత్వం పూర్తిస్థాయి రాయితీపై కుట్టు మిషన్లను అందించనున్నట్లు వివరించారు. అనంతరం ఎంఎల్ఎ కుట్టు శిక్షణా తరగతులు కొనసాగుతున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వెలుగు భీమడోలు ఎపిఎం రత్నకుమారి, కూటమి నాయకులు కరణం పెద్దిరాజు పాల్గొన్నారు.

హోమియో వైద్యసేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

హోమియో వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ఆకాంక్షించారు. ఏలూరు ఆర్ఆర్.పేటలోని పార్క్ వద్ద గురువారం నిర్వహించిన హోమియో వైద్య సృష్టికర్త డాక్టర్ శామ్యూల్ హనిమన్ 207వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజిషియన్స్ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కెఎస్ఎస్.శివమూర్తి ఆధ్వర్యంలో ఎంఎల్ఎ చంటికి ఘన స్వాగతం లభించింది. అనంతరం డాక్టర్ హనిమన్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, 33వ డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జ్ పి.సంధ్యాశ్రీలక్ష్మి, టిడిపి నాయకులు ఆరేపల్లి తిరుపతిరావు, ఐఐహెచ్‌పి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వికె పంకజాక్షన్, జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆర్‌పి భాస్కరాచార్యులు, డాక్టర్ కూరపాటి శ్రీనివాస్, డాక్టర్ రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

బుట్టాయగూడెం :బుట్టాయగూడెం మండల మారుమూల గ్రామమైన ముంజులూరులో సుమారు 200 మంది ప్రీ స్కూల్ విద్యార్థులకు కంచం, గ్లాస్, బుక్స్ కిట్లను ఆత్మబంధు సేవా సంస్థ ద్వారా ఐటిడిఎ పిఒ రాములు నాయక్ అందించారు. అనంతరం పులిరాముడుగూడెం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ తులసి, ఆత్మబంధు సంస్థ నిర్వాహకులు, మాజీ ఎంపిటిసి ఉద్దండం ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లను ప్రారంభించాలని ధర్నా

ఏలూరు అర్బన్ : జిల్లాలో లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికుల ఉపాధి కల్పనకు దోహదపడే విధంగా ప్రభుత్వం గుర్తించిన, అనుమతించిన ఇసుక రీచ్‌లను తక్షణమే ప్రారంభించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, నాయకులు పల్లెం కిషోర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఎఐటియుసి నాయకులతో జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఇసుక రీచ్‌లను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు వన్‌టౌన్‌లోని వెంకన్న ట్యాంక్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి చాటపర్రు రోడ్డు ఫీడరు, 11 కెవి సిబిఎస్ ఫీడర్లకు విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని విద్యుత్ శాఖ ఇఇ కెఎం.అంబేద్కర్ తెలిపారు. దాని పరిధిలోని ప్రేమాలయం రోడ్, పెదమాలపల్లి, తూర్పువీధి, గంగానమ్మగుడి ఏరియా, ఫిల్‌హౌస్ పేట, చాటపర్రు రోడ్, జ్వాలా పరమేశ్వర కాలనీ, దక్షిణపు వీధి, అశోకచక్రం రోడ్, పోణంగి రోడ్, అరుంధతీ పేట, పడమర వీధి, దొంగలమండపం రోడ్డు, పాలతూము సెంటర్, శనగపప్పు బజార్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని తెలిపారు. అలాగే ఈ నెల 11వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వట్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి సత్రంపాడు ఫీడర్‌కు వార్షిక మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అంబేద్కర్ తెలిపారు. సత్రంపాడు, విద్యావికాస్ రోడ్డు, సీతారామపురం రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని పేర్కొన్నారు.

భీమడోలు సెక్షన్ పరిధిలో...

భీమడోలు:ట్రాన్స్ కో భీమడోలు సెక్షన్ పరిధిలోని 33/11 కెవి సామర్ధ్యపు పూళ్ల, సూరప్పగూడెం, గుండుగొలను సబ్ స్టేషన్‌ల పరిధిలో ఈ నెల 11వ తేదీ శుక్రవారం మరమ్మతు, నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు ట్రాన్స్ కో ఆపరేషన్ ఏలూరు డివిజన్ ఇఇ అంబేద్కర్ తెలిపారు. దీనిలో భాగంగా విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేయడం, మరికొన్ని నూతన లైన్లు వేయడం, లైన్‌లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ నేపథ్యంలో 11 కెవి ఫీడర్లు దుద్దేపూడి, పూళ్ల, కురెళ్లగూడెం, ఎంఎం పురం, నాగా హనుమాన్ పారిశ్రామిక లైను, భీమడోలు, గుండుగొలను, సూరప్పగూడెం, పొలసానిపల్లి పరిధిలోని గ్రామాలకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ మేరకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఇఇ విజ్ఞప్తి చేశారు.

కొయ్యలగూడెం సెక్షన్ పరిధిలో...

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం సెక్షన్ పరిధిలో కొయ్యలగూడెం సబ్ స్టేషన్ నుంచి వెళ్లే 11 కెవి రాజవరం ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ట్రీ కటింగ్ చేసే నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ రామారావు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఎలక్ట్రికల్ ఇఇ పీర్ అహ్మద్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. పరింపూడి, పొంగుటూరు, గవరవరం గ్రామాల రైతులు సహకరించాలని రామారావు కోరారు.